సాక్షి సంగారెడ్డి

ఆదివారం : 22 : జనవరి : 2023



ప్రైవేట్ అద్దె గదుల దోపిడీ

కొమురవెల్లి మల్లికార్జున స్వామి భక్తులకు వసతి తిప్పలు తప్పడం లేదు. సరిపడా దేవాలయ గదులు లేకపోవడంతో ప్రైవేట్ అద్దె గదులను ఆశ్రయిస్తున్నారు. 8లో



డైజోఫాం తయారీదారుల అరెస్ట్

డైజోఫాం, ఐల్ప్రాజోలం తయారీ కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్టు పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. 8లో



పదిలో ప్రథమ స్థానం రావాలి

పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. 9లో

న్యూస్‌రీల్

కనీస వేతనం అందజేయాలి



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

పటాన్‌చెరు టౌన్: వీఓఏలకు కనీస వేతనం రూ. 15 వేలు అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వీఓఏలకు వచ్చే గౌరవ వేతనం ఏ మాత్రం సరిపోవడం లేదని.. వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో వేతనాలు పెంచే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీఓఏలు పాల్గొన్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 14 మందికి ర్యాపిడ్ యాంటిజెన్ పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగెటివ్‌గా నిర్ధారణ అయినట్టు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. అదేవిధంగా తొమ్మిది మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్టు వెల్లడించారు.

పొగాకు ఉత్పత్తులతో ఆరోగ్యానికి ముప్పు



బహిరంగ ప్రదేశంలో ధూమపానం చేసిన వ్యక్తికి జరిమానా విధిస్తున్న అధికారులు

పటాన్‌చెరుటౌన్: పొగాకు ఉత్పత్తులు వాడడం వల్ల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని బస్టాండ్, కళాశాలలు, ముత్తంగి రింగ్ రోడ్డు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల హైపర్ టెన్షన్, నోటి కేన్సర్, శ్వాసకోస, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం నేరమని అందుకు రూ. 200 జరిమానా విధిస్తారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాములు నాయక్, మధు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల్లో న్యాయం చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): 317 జీఓ కారణంగా జిల్లాలకు కేటాయించిన ఉపాధ్యాయులకు జీరో సర్వీస్‌తో బదిలీలకు అవకాశం కల్పించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్లాక్ చేసిన 13 జిల్లాలను ఓపెన్ చేసి స్పౌజ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, హెచ్‌ఎం లాంగ్ స్టాండింగ్ పీరియడ్ సర్వీస్‌ను యధాతథంగా కొనసాగించాలని కోరారు. బదిలీల షెడ్యూల్ కంటే ముందే స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలన్నారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని పేర్కొన్నారు.

స్పందన అంతంతే..

ముందుకురాని కాంట్రాక్టర్లు

- ఒక్కోపనికి నాలుగైదు టెండర్లు
- నిధులున్నా బాగుచేయడంలో జాప్యం
- రోడ్ల మరమ్మతు పనుల దుస్థితి ఇదీ



వట్‌పల్లి మండలంలోని ఓ రోడ్డు దుస్థితి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రోడ్ల మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. ఆయా పనులకు అధికారులు టెండర్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంటే ఒక్క కాంట్రాక్టర్ కూడా టెండర్ వేయడం లేదు. దీంతో ఒక్కోపనికి నాలుగైదు పర్యాయాలు నోటిఫికేషన్ జారీ చేయాల్సి వస్తోంది. గతంలో ఒక్కోపనికి పదుల సంఖ్యలో కాంట్రాక్టర్లు పోటీ పడేవారు. ఆయా పనులు అంచనా వ్యయం కంటే 20 శాతం, 30 శాతం తక్కువ టెండర్ వేసి పనులు దక్కించుకునే వారు. కానీ పరిస్థితి ఇందుకు భిన్నంగా మారింది. ఎక్సెస్ రేట్ టెండర్ కూడా వేసేందుకు జంకుతున్నారు.

నిధులున్నా పనులు సాగక..

జిల్లాలో రహదారుల పరిస్థితి దారుణంగా తయారైంది. పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారుల రాకపోకలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తీవ్రంగా దెబ్బతిన్న 43 రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లో రూ. 81 కోట్లను మంజూరు చేసింది. ఈనిధులతో 254 కి.మీ.ల పొడవున ఉన్న రోడ్ల బీటీ రెన్యూవల్ చేయాలని నిర్ణయించింది. ఈ పనులకు ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు పిలవగా కాంట్రాక్టర్లలో స్పందన కరువైంది. ఒక్కోపనికి నాలుగైదు పర్యాయాలు టెండర్లు పిలవాల్సి వస్తోంది. అలాగే అధిక వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు ఎఫ్‌డీఆర్ కింద ప్రత్యేకంగా నిధులు ఇచ్చింది. గతేడాది మంజూరైన ఈ నిధులకు ఇప్పటివరకు పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

పెండింగ్ బిల్లులు మంజూరైనా..

పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో గతంలో కొంత జాప్యం జరిగింది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దాదాపు బిల్లులు క్లియర్ అయ్యాయి. అయినప్పటికీ కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ కాంట్రాక్టు పనులు చేసే ఈ కాంట్రాక్టర్లు ప్రైవేట్ పనుల వైపు మొగ్గు చూపుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. చాలా మట్టుకు రియల్ఎస్టేట్, డెవలప్‌మెంట్ వర్క్స్ చేస్తుండడంతో రోడ్ల మరమ్మతులు చేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదని చెబుతున్నారు. మరోవైపు రోడ్ల మరమ్మతులకు మంజూరైన నిధులు నాన్‌ప్లాన్ కావడంతో కాంట్రాక్టర్లు సంశయిస్తున్నట్టు తెలుస్తోంది. ప్లాన్ వర్క్స్ అయితే నిర్ణీత సమయంలో బిల్లులు వస్తాయనే దీమా ఉంటుంది. నాన్‌ప్లాన్ పనులకు బిల్లుల చెల్లింపులు కాస్త ఆలస్యమయ్యే అవకాశాలుండటం కూడా ఓ కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాంట్రాక్టర్లతో చర్చిస్తున్నాం

స్పందన రాని పనులకు రీ టెండర్లు పిలుస్తున్నాం. కాంట్రాక్టర్లతో చర్చించి టెండర్లు వేయిస్తున్నాం. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పెండింగ్ బిల్లులు పెద్దగా లేవు. గతంలో పనులు చేసిన వారికి బిల్లుల చెల్లింపులు దాదాపు పూర్తయ్యాయి.

– సురేశ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆర్అండ్‌బీ

‘కంటి వెలుగు’ స్పందన బాగుంది



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్


కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో ‘కంటి వెలుగు’కు స్పందన బాగుందని కలెక్టర్ శరత్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతి కుమారి కంటి వెలుగుపై కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రెండు రోజుల్లో 23,330 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 5,043 మందికి రీడింగ్ అద్దాలు అందించామని తెలిపారు. 4,262 మందికి డిస్క్రిప్షన్ అద్దాల ఆర్డర్ పెట్టామని, రాగానే అందజేస్తామని వివరించారు. జిల్లాలో బఫర్ బృందాలను వినియోగిస్తూ ఉద్యోగులు, జర్నలిస్టులకు, పోలీస్, కోర్టు సిబ్బందికి ప్రత్యేకంగా క్యాంపులు ఏర్పాటు చేసేందుకు షెడ్యూల్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కంటి వెలుగు శిబిరాలను పక్కా ప్రణాళికతో నిర్వహించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు విధిగా పనిచేస్తున్న గ్రామంలో ఉండాలని స్పష్టం చేశారు. రాయికోడ్ కంటి వెలుగు బృందం 117 శాతం స్క్రీనింగ్ చేసినందుకు గానూ అభినందించారు. అలాగే 75 శాతానికిపైగా పన్ను వసూలు చేసిన వట్టిపల్లి, హత్నూర, కోహిర్, నారాయణఖేడ్ ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ అభినందించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాజర్షిషా, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, డీఆర్డీఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఎంహెచ్ఓ గాయత్రీదేవి, అధికారులు పాల్గొన్నారు. అనంతరం జంతు సంక్షేమంపై పశు సంవర్ధక శాఖ ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. జంతువుల పట్ల కరుణ చూపాలని.. జంతు సంక్షేమానికి ప్రభుత్వం జంతు హింస నివారణ చట్టం తీసుకొచ్చిందన్నారు. ఆ చట్టాన్ని ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలన్నారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రోగ నిరోధక టీకాలు వేయించాలని సూచించారు.

ఓటరు అవగాహన ర్యాలీ ప్రారంభం

ఈనెల 25వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ప్రచార రథాన్ని శనివారం కలెక్టర్ శరత్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా నియోజకవర్గాల్లో ప్రజలకు కళాజాత ద్వారా అవగాహన కల్పిస్తారని తెలిపారు.

కొల్లూరులో డబుల్ బెడ్రూం ఇళ్లు భేష్



స్టాండింగ్ కమిటీకి ఇళ్ల నిర్మాణాల నమూనాను వివరిస్తున్న అధికారులు

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను శనివారం సాయంత్రం హౌసింగ్, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బృందం పరిశీలించింది. రాజీవ్ రంజన్ సింగ్ అధ్యక్షతన రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో ఏర్పడిన కమిటీ రాష్ట్రంలో అమలుచేస్తున్న డబుల్ బెడ్రూం పథకం అమలును అధ్యయనం చేయడానికి హైదరాబాద్‌కు వచ్చింది. ఈసందర్భంగా డిగ్నిటీ హౌసింగ్ పథకం గురించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ డాక్టర్ ఎన్. సత్యనారాయణ కమిటీ సభ్యులకు వివరించారు. డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఉచితంగా అందించడానికి వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆధునిక సదుపాయలతో ఇళ్లు నిర్మించినట్టు పేర్కొన్నారు. నిర్వహణ ఖర్చులను భరించేందుకు ఆదాయ ఉత్పత్తికి వినూత్న చర్యలు చేపట్టడాన్ని కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో సంగారెడ్డి కలెక్టర్ శరత్, రంగారెడ్డి కలెక్టర్ అమయ్‌కుమార్, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ సంతోష్, ప్రియాంక అలా హౌసింగ్ అధికారి సురేశ్ కుమార్, రెవెన్యూ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు అంతరాష్ట్ర కుస్తీ పోటీలు



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో ఇండియన్ స్టయిల్ రెజ్లింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22న అంతరాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ అలీ అహ్మద్ తెలిపారు. పోటీలకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి మల్లయోధులు పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, విజేతలకు క్యాష్ ప్రైజ్‌తో పాటు గోల్డ్ మెడల్స్ అందజేస్తామని తెలిపారు.



క్యూ లైన్‌లో భక్తులు

కేతకిలో అమావాస్య సందడి

ఝరాసంగం(జహీరాబాద్): కేతకి సంగమేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. శనివారం అమావాస్యను పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పవిత్ర పుణ్యస్థానాలు ఆచరించి గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. అభిషేకం, అర్చన, హారతి, వాహన పూజ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ శశిధర్, పాలకమండలి చైర్మన్ నీల వెంకటేశం, అధికారి శివకుమార్, పాలకమండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఖాళీ స్థలాలకు ఆర్టీసీ టెండర్లు

సంగారెడ్డి టౌన్: మెదక్ రీజియన్ పరిధిలోని వివిధ డిపోల్లో ఖాళీగా ఉన్న స్థలాలను అద్దెకు ఇవ్వడానికి టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్టు ఆర్ఎం సుదర్శన్ శనివారం ఒక ప్రకటన తెలిపారు. టెండర్ల ప్రక్రియ ఈనెల 31వ తేదీ వరకు మెదక్ నర్సాపూర్, నారాయణఖేడ్, సంగారెడ్డి, జహీరాబాద్, సిద్దిపేట, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ డిపోల్లో ఖాళీ స్థలాలు షాపులకు టెండర్లు ఉన్నాయన్నారు. సంగారెడ్డి, సిద్దిపేట డిపోలో సైతం టెండర్లు వేయొచ్చని అన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత డిపోల్లో సంప్రదించాలని సూచించారు.

నేడే మల్లన్న పట్నం వారం

- అందంగా ముస్తాబైన ఆలయ పరిసరాలు
- మూడు నెలల పాటు సాగనున్న జాతర
- తోట బావివద్ద అగ్ని గుండాలు
- పెద్ద పట్నానికి భారీగా ఏర్పాట్లు



విద్యుత్ కాంతుల్లో మల్లికార్జునస్వామి ఆలయం



స్వామివారి దర్శనానికి వస్తున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న జాతర నేటి(ఆదివారం) పట్నం వారంతో మొదలై మూడు నెలల పాటు కొనసాగనుంది. ఈ ఏడాది తొమ్మిది వారాల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. మొదటి పట్నం వారానికి మల్లన్న క్షేత్రం అందంగా ముస్తాబైంది. తోటబావి వద్ద సోమవారం పెద్ద పట్నం, అగ్నిగుండాలు నిర్వహించే స్థలంలో భారీ ఇనుప గేట్లు ఏర్పాటు చేశారు. అగ్నిగుండాలు భక్తులు చూడడానికి, దాటడానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు నాలుగు రకాల దర్శనాలను ఏర్పాటు చేశారు. ధర్మదర్శనం, రూ.100తో శీఘ్ర దర్శనం, రూ.150తో విశిష్ట, రూ.500 వీవీఐపీ దర్శనాలకు ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు.

భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు

కొమురవెల్లిలోని సినిమా టాకీస్, బస్టాండ్, పెద్దమ్మ ఆలయం, రాంసాగర్ రోడ్డులోని కురుమ సత్రం వరకు, చేర్యాల రోడ్డులోని బస్టాండ్ దాటి వై జంక్షన్ స్వాగత తోరణం వరకు భక్తులకు అవసరమైన పార్కింగ్, తాగునీరు తదితర వసతులను ఏర్పాటు చేశారు. ఈ జాతరకు సుమారు 50 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. ఆలయ ప్రాంగణంలోనికి వాహనాలు రాకుండా పోలీస్ అధికారులు ఆంక్షలు విధించారు. రోడ్డుపై స్టాపర్స్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక పార్కింగ్ స్థలాకు చేరుకునేందుకు చర్యలు చేపట్టారు.

శనివారం దూళి దర్శనం

పట్నం వారానికి భక్తులు శనివారం నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆయానికి చేరుకున్న భక్తులు కాళ్లు, చేతులు కడుగకుండా దూళి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆదివారం స్నానమాచరించి పట్నం, బోనంతో స్వామికి మొక్కులు చెల్లించుకుంటారు. సోమవారం సాయంత్రం వరకు మొక్కులు చెల్లించుకుని మంగళవారం ఉదయం వరకు కొండపోచమ్మ ఆలయానికి చేరుకుంటారు.

భక్తులకు బస్సు మార్గాలు

- హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ నుంచి భక్తులు రావడానికి ఆర్టీసీ అధికారులు స్పెషల్ బస్సులను ఏర్పాటు చేశారు.
- హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులకు జేబీఎస్ ను ంచి స్పెషల్ బస్సులు అందుబాటులో ఉ న్నాయి.
- అలాగే సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, మెట్‌పల్లి, బస్సుల్లో వచి కొమురవెల్లి పాత కమాన్ వద్ద దిగి అక్కడి నుంచి ఆటోల ద్వారా ఆలయానికి చేరుకోవచ్చు.

పార్కింగ్ ఇలా..

- సిద్దిపేట నుంచి పాత కమాన్ మీదుగా వచ్చే వాహనాలకు.. సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, మెట్‌పల్లి నుంచి వచ్చే భక్తులు సిద్దిపేట కమాన్ నుంచి మల్లన్న చెరువు వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- జనగామ, వరంగల్, నల్లగొండ నుంచి వచ్చే భక్తులు బస్టాండ్ సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు.

అన్ని సౌకర్యాలు కల్పించాం

పట్నం వారానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాం. రాజగోపురం ముందు, స్నానాల ఘట్టాల వద్ద ,బుకింగ్ కార్యాలయం ముందు చలువ పందిల్లు ఏర్పాటు చేశాం. క్యూలైన్లలో ప్రత్యేక సౌకర్యాలు కల్పించాం.మల్లన్న క్యూలైన్లలో అక్రమ వసూళ్లతో దర్శనానికి పంపించినా ,అక్రమ వసూళ్లు చేపట్టిన చర్యలు తీసుకుంటాం.

–గీస భిక్షపతి, ఆలయ చైర్మన్

జేబీఎస్ నుంచి ప్రత్యేక బస్సులు

సిద్దిపేటకమాన్: జూబ్లీ బస్టాండ్(జేబీఎస్) నుంచి కొమురవెల్లి దేవస్థానానికి, కొమురవెల్లి నుంచి జేబీఎస్‌కు ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రతీ అర గంటకు ఆర్టీసీ బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కొమురవెల్లి గేట్ నుంచి ఆలయం వరకు, కొమురవెల్లి నుంచి కొండపోచమ్మ ఆలయం వద్దకు ప్రత్యేక షటిల్ బస్సులు 22వ తేదీ వరకు నడుపనున్నట్లు డీఎం తెలిపారు. ప్రయాణికులు, భక్తులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘ఆదర్శం’ పిలుస్తోంది

- ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఫిబ్రవరి 15వ తేదీ వరకు గడువు
- జిల్లాలో 10 మోడల్ స్కూళ్లు



ఝరాసంగంలోని తెలంగాణ మోడల్ స్కూల్

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం మోడల్ స్కూల్ (తెలంగాణ ఆదర్శ పాఠశాలల)ను ఏర్పాటు చేసింది. కార్పొరేట్ తరహాలో విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. జిల్లాలోని తెలంగాణ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈనెల తొమ్మిదిన నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఆరో తరగతితో పాటు 7, 8, 9, పదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా పది మోడల్ స్కూళ్లు ఉండగా.. ఆయా పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉంది.

వృత్తి విద్య కోర్సులు సైతం..

విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులను సైతం అమలు చేస్తున్నారు. వారిలో దాగి ఉన్న నైపుణ్యతను వెలికితీయడంతో పాటు ఉపాధి అవకాశాలు సైతం కల్పించేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ పథకం ద్వారా విద్యార్థులకు కోర్సును అందజేస్తున్నారు. విద్యార్థులకు ఆయా కోర్సులకు బట్టి సర్టిఫికెట్లను సైతం అందిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో స్వీకరణ

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రస్తుతం ఆరో తరగతిలో 100 సీట్లను భర్తీ చేయడంతో పాటు మిగితా తరగతుల్లో ఖాళీ అయ్యే సీట్లను విద్యాశాఖ నిబంధనల మేరకు భర్తీ చేయనున్నట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు రూ. 200లు చెల్లించి ఫిబ్రవరి 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 8న హాల్‌టికెట్లు జారీ చేసి, 16న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతి, అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7 నుంచి పదో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అర్హులైన విద్యార్థులు వెబ్‌సైట్ http://telanganams.cgg.gov.in/ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



అర్హులైన విద్యార్థులు మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి. ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ముఖ్యమైన తేదీలను గుర్తుంచుకొని ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా దరఖాస్తు చేయాలి. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అవకాశం ఉంది.

– రియాజుద్దీన్, ప్రధానోపాధ్యాయుడు, ఝరాసంగం

క్లుప్తంగా

వినాయక మార్ట్ తనిఖీ



సరుకుల ధరలను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో ఇటీవల ప్రారంభించిన వినాయకమార్ట్‌ను శనివారం జిల్లా తూనికల కొలతల అధికారి శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు. మార్టులోని సరుకులను పరిశీలించి, వాటి ధరల వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. మార్టులో నిర్ణీత ఎమ్మార్పీ ధరకన్నా ఎక్కువకు అమ్ముతున్నట్లు ఫిర్యాదు అందినట్లు చెప్పారు. విచారణ చేయగా తేడా వచ్చిన డబ్బును వినియోగదారుడికి తిరిగి ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారన్నారు. మార్టులో తూకానికి వినియోగిస్తున్న కాంటాలను సంబంధిత అధికారులతో సర్టిఫై చేయించుకోవాలని సూచించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి జిల్లా అవార్డు

చిన్నకోడూరు(సిద్దిపేట): సిద్దిపేటలో జరిగిన జిల్లా స్థాయి టీఎల్‌ఎం మేళాలో మండల పరిధిలోని రామునిపట్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సువర్ణదేవి ఫన్ గేమ్ రూపొందించారు. దీని ద్వారా అక్షరాలను గుర్తిస్తూ పదాలను తయారు చేసే విధానాన్ని వివరించారు. జిల్లా స్థాయిలో సువర్ణాదేవికి ద్వితీయ బహుమతి సాధించారు. ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆమెను అభినందించారు.

ప్రేమ విఫలమైందని యువతి ఆత్మహత్య

పటాన్‌చెరుటౌన్: ప్రేమ విఫలమైందని ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లాకు చెందిన దుర్గమ్మ బతుకుదెరువు కోసం కూతురిని తీసుకొని పటాన్‌చెరు వచ్చింది. గౌతమ్‌నగర్ కాలనీలో ఉంటూ, కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. శనివారం దుర్గమ్మ కూలిపనికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న కూతురు కవిత(17) ఉరి వేసుకుంది. రాత్రి ఇంటికి వచ్చిన దుర్గమ్మకు కూతురు ఆత్మహత్య చేసుకుని కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తన కూతురు ప్రేమ విఫలమైనందున ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ అద్దె గదుల దోపిడీ

కొమురవెల్లి జాతరలో ఇష్టారాజ్యంగా వసూలు

- దేవాలయ ఆధ్వర్యంలో 70 గదులు మాత్రమే
- ప్రైవేట్ గదులను ఆశ్రయిస్తున్న భక్తులు
- గదికి ఒక్క రోజుకు రూ.4 వేల నుంచి రూ.10 వేల డిమాండ్
- పట్టించుకోని పోలీసులు, రెవెన్యూ అధికారులు



కొమురవెల్లి జాతరకు వస్తున్న భక్తులు

సాక్షి, సిద్దిపేట: కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకునే భక్తులకు వసతి ఇబ్బందులు తప్పడం లేదు. కొమురవెల్లి జాతరలో భక్తుల తాకిడికి సరిపడా దేవాలయ గదులు లేకపోవడంతో ప్రైవేట్ అద్దెగదులను ఆశ్రయిస్తున్నారు. జనవరి నుంచి మార్చి వరకు ఆది, బుధవారం భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీంతో ప్రైవేట్ అద్దె గదుల నిర్వాహకులు భక్తులను దోచుకుంటున్నారు. సామాన్య భక్తులు అంత చెల్లించలేక చెట్ల కిందనే ఉంటూ నానా అవస్థలు పడుతున్నారు.

రోజుకు రూ 4 వేల నుంచి 10 వేలు

గది విస్తీర్ణాన్ని బట్టి భక్తుల నుంచి కిరాయి వసూలుచేస్తున్నారు. గదికి ఒక రోజుకు రూ.4 వేల నుంచి రూ10 వేల వరకు వసూలు చేస్తున్నారని భక్తులు చెబుతున్నారు. డిమాండ్ ఉంటే మరింత ఎక్కువ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

- ప్రైవేట్ గదుల నిర్వాహకులు ఎజెంట్‌లను ఏర్పాటు చేసుకొని అద్దెకు ఇస్తున్నారు. దేవాలయ పార్కింగ్ స్థలాలకు ఏదైన కారు వస్తే వారు వాలిపోతారు. మా దగ్గర అన్ని సౌకర్యాలతో గదులు ఉన్నాయి, మా దగ్గర ఉన్నాయంటూ ఎజెంట్‌లు భక్తుల చుట్టు తిరుగుతుంటారు. దేవస్థానం గదులు లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ గదులు అద్దెకు తీసుకుంటున్నారు.
- కొందరు భక్తులు చెట్ల కిందనే బోనం వండి, పట్నం వేసి మల్లన్నకు మొక్కులు చెల్లిస్తున్నారు. దేవాలయ ప్రాంగణంలో వసతి కోసం కాటేజీలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- భక్తుల సహకారంతో 140 కాటేజీలను నిర్మించారు. అందులో 25 పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. 40 గదులు దేవాలయ అవసరాలకు వినియోగిస్తున్నారు. దీంతో 75 గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఆ గదులు తొలి ప్రాధాన్యత దాతలకు ఇస్తున్నారు.
- కొమురవెల్లిలో 50 కాటేజీలు కొత్తగా నిర్మిస్తున్నారు. నాలుగేళ్లుగా పనులు సాగుతూనే ఉన్నాయి. పంచాయతీ రాజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ నత్తనడకన పనులు చేస్తున్నాడు. ఇప్పటికైనా దేవాలయ అధికారులు, రెవెన్యూ, పోలీసులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని ప్రైవేట్ గదుల అద్దెలను నియంత్రించాలని, మరిన్ని కాటేజీలు ప్రభుత్వం నిర్మించే విధంగా ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

రోజుకు రూ.6 వేలు చెల్లించా



మేము గత 25 సంవత్సరాలుగా స్వామివారిని దర్శించుకుంటున్నాం. ఏటా పట్నం వారం సందర్భంగా ఇక్కడికి వచ్చి బోనం, పట్నం వేసి బస చేస్తాం. కానీ ఈసారి ప్రైవేట్ వసతి గదుల కిరాయి బాగా పెరిగింది. మేము ఈసారి రూ.6 వేలు చెల్లించాం. మేము ఆ గదిని రెండు నెలల క్రితమే బుక్ చేసుకున్నాం.

– సురేశ్, భక్తుడు హైదరాబాద్

ప్రైవేట్ వసతి గదుల నిర్వాహకులపై నియంత్రణ లేదు



ప్రైవేటు వసతి గదుల నిర్వాహకులపై దేవదాయ శాఖ ఎలాంటి నియంత్రణ విధించ లేదు. రాష్ట్ర పండగలలో మాత్రం వారిపై రెవెన్యూ శాఖ చర్యలు తీసుకోవచ్చు. దేవాలయం ఆధ్వర్యంలో కొత్తగా గదులు నిర్మిస్తున్నాం.

– బాలాజీ ,ఆలయ ఈవో

బాల్య వివాహాలను అరికట్టాలి

మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ



మాట్లాడుతున్న సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాల్య వివాహాలను అరికట్టాలని సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ అన్నారు. శనివారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో మహిళల రక్షణ చట్టాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, ఉమెన్ షీ టీమ్ ప్రాముఖ్యత, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అజిత్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆర్గనైజర్ రాము, స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ శివకుమారి, ఇన్‌స్పెక్టర్ దుర్గ మాట్లాడారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా బాల బాలికలు, మహిళల రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పోక్సో, బాల్య వివాహాల చట్టాల గురించి వివరించారు. సమస్యలపై 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 8333998699, షీ టీమ్ వాట్సప్ నంబర్ 7901640473, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498 ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శారద, స్నేహిత సపోర్ట్ సెంటర్ కోఆర్డినేటర్లు వసంత, సిద్దిపేట షీ టీమ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇద్దరు ఆత్మహత్య

తొగుట(దుబ్బాక): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. తొగుట ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముచ్చర్ల మల్లేశం (55) గత కొన్నేళ్లుగా పెట్రోల్ పంపు నిర్వహిస్తున్నాడు. పెట్రోల్ పంపు నిర్వాహణకు రూ.20 లక్షలు అప్పు చేశాడు. అవి తీర్చే మార్గం లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. శుక్రవారం మల్లన్న సాగర్ కట్ట సమీపంలో పురుగుల మందు తాగి భార్య మల్లవ్వ, కూతురు మానసకు ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. వెంటనే వారు ఇరుగు పొరుగువారితో కలిసి వెళ్లి చూడగా మల్లేశం అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం మరణించారు. మృతుడి భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

కల్హేర్(నారాయణఖేడ్): మద్యానికి బానిసై, జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కల్హేర్ ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్ శనివారం వివరాలు తెలిపారు. మండలంలోని బీబీపేటకు చెందిన వడ్డె సాయిలు(35) వివాహం ఎనిమిదేళ్ల క్రితం కామారెడ్డి జిల్లా జగన్నాథ్‌పల్లికు చెందిన అంజలితో జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. రెండేళ్ల క్రితం భార్య అంజలి పుట్టింటికి వెళ్లింది. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ చేసినా రాజీ కుదరలేదు. పిట్లంలో కూలీ పనులు చేసుకుంటూ సాయిలు మద్యానికి అలవాటు పడ్డాడు. మద్యనికి బానిసగా మారడం, భార్య పుట్టింటికి వెళ్లడంతో గ్రామ శివారులో వేప చెట్టుకు ఉరేసుకున్నాడు.

ప్రమాదవశాత్తు చెరువులోపడి యువకుడి మృతి



రోదిస్తున్న నవీన్ కుటుంబ సభ్యులు

హత్నూర(సంగారెడ్డి): ప్రమాదవశాత్తు చెరువులోపడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధి ముచ్చర్ల గ్రామంలో శనివారం మధ్యాహ్నం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన సంపంగి నవీన్ (23) వారం క్రితం భార్యా పిల్లలతో కలిసి ముచ్చర్ల గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చారు. శనివారం మధ్యాహ్నం బావమరిది వడ్డే శేఖర్‌తో కలిసి గ్రామ శివారులోని పెద్ద చెరువులో స్నానం చేసేందుకు దిగారు. నవీన్ నీటిలో మునిగిపోతుండగా శేఖర్ గమనించి రక్షించే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకొని చెరువులో గాలించగా సుమారు 2 గంటల తర్వాత మృతదేహాన్ని బయటకు తీశారు. సంఘటన స్థలాన్ని హత్నూర పోలీసులు సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఏడాది బాబు ఉన్నారు.

రోదించిన కుటుంబ సభ్యులు

తూప్రాన్: రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం యువకుడి మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలోని గుండ్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డెర భాగ్యమ్మ రాములు ద్వితీయ కుమారుడు నవీన్(23) సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన అనంతలక్ష్మితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. కాగా శుక్రవారం అత్తగారి ఇంటికి వెళ్లిన నవీన్ తన బావమరిది శేఖర్‌తో కలిసి గ్రామ సమీప చెరువులో స్నానం చేసేందుకు వెళ్లి శవమై తేలాడు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కమిటీ గ్రామ అధ్యక్షుడు మనే కృష్ణ, రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

కాలిపోయిన రోడ్డు పక్క దుకాణాలు



అగ్ని ప్రమాదంలో కాలిన దుకాణాల వద్ద బాధితులు, వారి బంధువులు

నర్సాపూర్: ప్రమాదవశాత్తు శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో దుకాణలు కాలిబూడిదయ్యాయి. లక్షల్లో ఆస్థి నష్టం సంభవించింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ మెయిన్‌రోడ్డులో దుకాణాల వెనుక ఉన్న ఆర్టీసీకి చెందిన ఖాళీస్థలంలో చెత్త పారబోస్తుంటారు. కొన్ని రోజులుగా చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెడుతుండగా తాము నీళ్ల చల్లి దుకాణదారులు రాములు, శంకర్, ప్రేంనారాయణ, నరేశ్ తెలిపారు. శుక్రవారం రాత్రి తమ దుకాణాలు మూసి వేసే సమయంలో చెత్తకు నిప్పటించిన విషయాన్ని తాము గమనించలేదన్నారు. సుమారు 11.30 గంటల సమయంలో తమ దుకాణాలకు నిప్పంటుకుందని వాపోయారు. చుట్టు పక్కల వారు గమనించి తమకు సమాచారం ఇచ్చారన్నారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారని, అప్పటికే దుకాణాలు కాలిబూదిదయ్యాయని కన్నీటి పర్యంతమయ్యారు. రూ.4.50 నుంచి రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లి నట్లు బాధితులు రాములు, శంకర్ తెలిపారు. అలాగే రూ.80 వేల నష్టం వాటిల్లినట్లు పండ్ల వ్యాపారి ప్రేమ్ నారాయణ తెలిపాడు. తనకు రూ.2.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు హెయిర్ స్టైల్ షాపు యజమాని నరేశ్ వాపోయాడు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.

డైజోఫాం తయారీదారుల అరెస్ట్

- ముగ్గురి రిమాండ్, మరో నిందితుడు పరారీ
- 600 గ్రాముల డైజోఫాం, 1.9 కేజీల వ్యర్థాలు స్వాధీనం
- కారు, బైక్, నాలుగు సెల్ ఫోన్లు, తయారీ యంత్రాలు సీజ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణు గోపాల్ రెడ్డి

పటాన్‌చెరుటౌన్: డైజోఫాం, ఐల్పాజోలం తయారీ కేసులో ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శనివారం పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పటాన్‌చెరు సీఐ వేణు గోపాల్ రెడ్డి,క్రైం సీఐ బీసన్న వివరాలు వెల్లడించారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామ శివారులో ఈనెల 20వ తేదీన కెఎస్‌ఎం జనరిక్ ఫార్మాసిటికల్స్ లిమిటెడ్ కంపెనీ పక్కన ల్యాబ్‌లో ముగ్గురు వ్యక్తులు ఏదో పౌడర్‌ను తయారు చేస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్‌ఐ రామానాయుడు సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా తిరుపతికి చెందిన మదన్ మోహన్ రెడ్డి, ఇతడు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో డిప్లమా ఇన్ కెమికల్ ఇంజనీరింగ్ పట్టభద్రుడు, రెండో వ్యక్తి గుంటూరుకు చెందిన గురువారెడ్డి ప్రస్తుతం కామారెడ్డిలో నివాసం ఉంటున్నాడు, మూడో వ్యక్తి దుబ్బాక మండలం ధర్మాజీపేటకు చెందిన మనోహర్‌గౌడ్‌గా గుర్తించారు. గత ఏడాది జూలైలో డైజోఫాం రవాణా కేసులో సిద్దిపేట రూరల్ పోలీసులు నాగిరెడ్డి, రమణారావు, గురువారెడ్డి, వెంకట్రామిరెడ్డి, సురేశ్‌లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత డైజోఫాం తయారీకి ల్యాబ్ కోసం గూగుల్ లో శోధించారు. పాశమైలారం పారిశ్రామికవాడ చూపిందని, దీంతో వీరు ల్యాబ్ నిర్వాహకులతో మాట్లాడుకొని రోజుకు రూ.7 వేలు అద్దె చెల్లిస్తున్నారు. ఇందులో డైజోఫాం, ఐల్పాజోలం తయారు చేస్తున్నారు. 600 గ్రాముల డైజోఫాం, 1.9 కేజీల తయారీ వ్యర్థ పదార్థంతో పాటు కారు, బైక్, నాలుగు సెల్ ఫోన్లు, తయారీ యంత్రాలు, కెమికల్స్‌ను సీజ్ చేసి వారిని రిమాండ్ కు తరలించారు. పరారీలో ఉన్న నరేందర్‌రెడ్డిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ వేణు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మూతపడిన పరిశ్రమలపై నిఘా పెట్టామని, పరిశ్రమ యాజమానులు, స్థానికులు అపరిచితులు ఎవరైన అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

రోగులకు అందని వైద్యం



వీడియోను మీడియాకు చూపుతున్న శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సకాలంలో వైద్యం అందడంలేదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం ముత్తంగి బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ వైద్య సేవలపై ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మంత్రి హరీశ్‌రావు, జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో రోగికి వైద్యేతర సిబ్బంది ప్రథమ చికిత్స చేసే వీడియోని ప్రదర్శించారు. ఈ సంఘటనపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వివరణ ఇవ్వాలన్నారు. వివరణ ఇవ్వని పక్షంలో పటాన్‌చెరు ఆస్పత్రిని, ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు సాయి కుమార్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగు ధన్‌రాజ్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు రాజ్ గోపాల్ యాదవ్, సంగమేశ్వర్, ఆదిత్య, ఎస్‌ఆర్‌కె యువసేన సభ్యుడు మచ్చ కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాములు మృతదేహం

బెజ్జంకి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌కు చెందిన కూన రాములు(57) కూలి పనులు చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి కూలి పనులు చేసి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇసుక లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. లారీ డ్రైవర్ మోహన్ అజాగ్రత్తగా వాహనాన్ని నడపడం వల్లే రాములు మృతిచెందినట్టు భార్య లక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

బండరాయి మీదపడి..

పటాన్‌చెరుటౌన్: బండరాయి మీద పడటంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసులు రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వెంకటాపూర్ బీమ్లా తండాకు చెందిన హరిచంద్ (46) కుటుంబ సభ్యులతో కలసి బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం అర్ధ రాత్రి అమీన్‌పూర్ పెద్దచెరువు కింది భాగంలో భవన నిర్మాణ వ్యర్థాలను లారీల్లో తీసుకొని వచ్చి పారబోస్తున్నారు. అందులో ఉన్న ఇనుప ముక్కలు తీసుకునేందుకు హరిచంద్ అక్కడికి వెళ్లాడు. వాటిని తీస్తున్న క్రమంలో మట్టిని పారతో తొలగిస్తుండగా పెద్దబండ రాయి అతనిపై దొర్లి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బండరాయిని తొలగించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ట్రాలీ టైరు కిందపడి బాలుడు..

సదాశివపేటరూరల్ (సంగారెడ్డి): ప్రమాదవశాత్తుగా ట్రాక్టర్ చక్రాల కింద పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోనా పూర్ గ్రామానికి చెందిన అసద్(2) ఉదయం ఇంటి వద్ద ఆడుకుంటున్నాడు. అలా ఆడుకుంటూ చెత్త సేకరణకు వచ్చి ట్రాక్టర్ ట్రాలీ వైపు వెళ్లాడు. అది గమనించకుండా ట్రాక్టర్ డ్రైవర్ ముందుకు వెళ్లడంతో ట్రాలీ టైరు కిందపడి బాలుడు మృతి చెందాడు. బాలుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సదాశివపేట సీఐ నవీన్ కుమార్ తెలిపారు.

నలుగురి అదృశ్యం

పోలీసు స్టేషన్ పరిధిలో నలుగురు అదృశ్యమయ్యారు. వారిలో ఒక విద్యార్థి, వివాహిత, ఇద్దరు యువకులు ఉన్నారు. అక్రమ సంబంధ ఉందని భార్య కేసు పెట్టడంతో పోలీసులు భర్తకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో స్నేహితులు పిలుస్తున్నారని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. కోడలు, అత్తింటివారిపై తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరో చోట విహార యాత్రకు వెళ్తున్నానని ఇంటిలో చెప్పి వెళ్లిన విద్యార్థి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఇంకోచోట జీతం దబ్బు ఇంటిలో ఇవ్వక పోడంతో తండ్రి మందలించాలని కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భార్యాభర్తలు తగవుపడటంతో భార్య పుట్టింటికి వెళ్లింది. అక్కడ ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్నేహితులు పిలుస్తున్నారని వెళ్లి...



రవి (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: స్నేహితులు పిలుస్తున్నారని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణంలోని జెపీ కాలనీకి చెందిన నాగామణి కుమారుడు రవి(24)కి జోగిపేటకు చెందిన రేణుకను ఇచ్చి వివాహం చేశారు. రవికి అక్రమ సంబంధం ఉందని రేణుక జోగిపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు రవికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో 19వ తేదీ ఉదయం ఇద్దరు వ్యక్తులు వచ్చి రవిని బయటకు రమ్మని పిలిచారు. స్నేహితులు పిలుస్తున్నారని ఇంటిలో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుమారుడి కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. తన కొడుకు అదృశ్యంపై కోడలు రేణుక, ఆమె తల్లి నాగమణి, లోకేష్‌పై అనుమానం ఉందని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎగ్జిబిషన్‌కు వెళ్తున్నానని ..

విహార యాత్రకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నాడు. ఈనెల 10వ తేదీన విహారయాత్ర కోసం బాసర వెళ్తున్నామని రూ.2 వేలు తీసుకొని వెళ్లాడు. టూర్‌కు వెళ్లిన విద్యార్థులు 11వ తేదీన సాయంత్రం వచ్చారు. అతడు మాత్రం ఫోన్‌చేస్తే విజయవాడలో ఉన్నానని తెలిపాడు. మళ్లీ ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుమారుడి కోసం తెలిసిని అడిగినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జీతం డబ్బులు ఇవ్వడం లేదని..



హరీశ్ (ఫైల్)

జీతం ఇంట్లో ఇవ్వడం లేదని తండ్రి మందలించడంతో కుమారుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పరిధిలోని నర్రగూడెంకు చెందిన కాంతయ్య కుమారుడు హరీశ్(24) ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే జీతం ఇంట్లో ఇవ్వకపోవడంతో ఈనెల 5వ తేదీన తండ్రి మందలించాడు. దీంతో హరీశ్ అలిగి సర్టిఫికెట్లు తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. కోపంతో వెళ్లిన కుమారుడు తిరిగి వస్తాడని కుటుంబ సభ్యులు ఎదురు చూశారు. తిరిగి రాకపోవడంతో అమీన్‌పూర్ పోలీసు స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బయటకు వెళ్లి వస్తానని చెప్పి..



స్వాతి (ఫైల్)

బయటకు వెళ్లి వస్తాన్ని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ వివాహిత అదృశ్యంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన స్వాతికి సంగారెడ్డికి చెందిన రాంరెడ్డి తో వివాహం జరిగింది. 19వ తేదీన స్వాతి తన భర్త తో గొడవపడి రుద్రారంలో ఉండే కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు ఇంటికి రమ్మని చెప్పడంతో 20వ తేదీన రుద్రారం గ్రామానికి వచ్చింది. కుటుంబ సభ్యులు స్వాతికి నచ్చజెప్పారు. అదేరోజు మధ్యాహ్నం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. స్వాతి సోదరుడు సతీశ్ ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.